# పరబ్రహ్మ పురాణం విషమస్కంధం

-కృష్ణ

**పరబ్రహ్మం** మొదటి ముద్ద తినగానే "కూర పాడు చేశావోయ్" అన్నాడు.

రెండు క్షణాలు భర్త వంక చూసి "ఒక్క ముద్ద తిన్నారో లేదో అప్పుడే కూర రుచి తెలిసిందా!" అన్నది సుగుణ ఆవేదనగా. "అయినా చూస్తున్నాగా. ఈ మధ్యన మీకు ఇంటి వంట బొత్తిగా నచ్చడం లేదు లెండి. ప్రతి దానికీ వంకలు పెట్టడం 'బాగా' నేర్చారు."

"అన్నం అంతా తినాలేంటి? మెతుకు పట్టి చూస్తే తెలీదూ?"

"అది వేరు. ఉడుకు పట్టిందా, లేదా తెలుసుకోవ డానికి వేలితో మెతుకు పట్టి చూస్తే తెలీదా అని సామెత. రుచి గురించి చెప్పింది కాదు. ముద్ద ఇట్లా నోట్లో పెట్టుకోగానే అట్లా వ్యాఖ్యానించే వాళ్ళని మిమ్మల్నే చూస్తున్నాను" అంటూండగానే పరబ్రహ్మం మరో ముద్దకి రూపం తెస్తూండటం కనిపించి విజయోత్సాహంతో అన్నది సుగుణ: "అయినా ఏమైందా కూరకి? 'చక్కహా' ఉంటేనూ!"

"నేను చక్కగా లేదన్నానా? రుచిగా లేదన్నాను కానీ." భృకుటి ముడివాడు పరబ్రహ్మం. "ఒక్క ముద్దతోనే రుచి తెలుస్తుందా అంటున్నావు కాని ఫిబ్రవరి పదహారు నాడు ముద్ద ఇట్లా నోట్లో వేసుకుని అట్లా ఉమ్మేసున్నావా లేదా? ఎందుకట? 'ముష్టి' పిడికెడు ఉప్పు ఎక్కువైనందుకేగా! మళ్ళీ మార్చి పదహారు నాడేమో 'అయ్యో, ఉప్పుకరు వొచ్చిందిటండీ!' అంటావూ! మీ ఆడాళ్ళ బుద్ధి ఇంతే. మగాళ్ళ వంటని గౌరవించటం ఎప్పుడు నేర్చుకుంటారో! అదీ నలుడూ, భీముడూ మా వాళ్ళే ఉండికూడా పైగా ఈ ధోరణి ఇవ్వాళ్టిదా, విన్నటిదా! యుగ యుగాలుగా అనాదిగా.."

అప్రతిభురాలై చూస్తూండి పోయింది సుగుణ. వంటింట్లో ఇంత ఘాటైన జవాబా! ఇదే ప్రథ మానుభవం తనకి. తేరుకుని చట్టబద్ధంగా మాట్లా డుతూ అన్నది: "ఆడా మగా అన్న భేదభావం లేదండీ నాకు. మానవులంతా సమానులే. ఇవ్వాళ స్త్రీగా పుట్టిన వ్యక్తి రేపు పురుషుడుగా పుట్టచ్చు. అట్లాగే ఇవ్వాళ పురుషుడుగా ఉన్న వ్యక్తి నిన్న స్త్రీగా పుట్టి ఉండచ్చు. అదేకదా సృష్టి విలాసం!. హుఁ. ఇంతకీ కూర రుచిగా లేదంటారు. అంతేనా? పోనీ ఆ సంగతి చెప్పచ్చుగా. దాని కింత రాద్ధాంతం చేస్తారేం? మళ్ళీ 'చక్కహా' ఉందని మీరే ఒప్పుకుం టున్నారు. జపాను వాళ్ళు తినే పదార్థాల్లోకూడా రుచి కంటే సౌందర్యానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని మీరేగా మొన్న చెప్పారు. ఇవ్వాళేమో ఇట్లానా? హుఁ!"

"నేను జపానువాణ్ణి కాదు. నేను తెలుగు వాణ్ణి." సగర్వంగా రొమ్ము చరుచుకుంటూ అన్నాడు పరబ్రహ్మం. "నా చరిత్ర వేరు, నా సంస్కృతి వేరు, నా సంప్రదాయాలు వేరు."

"ఊహుఁ" అంది సుగుణ, 'అలాగేం' అన్నట్లు. "మరి అట్లాంటప్పుడు మొన్న మీ కన్నడిగ ఫ్రెండింట్లో తిన్నాక వంకాయ కూరలో ధనియాల పొడి వెయ్యి, బాగుంటుందని ఎందుకు పురమా యించారు?" ఆయువు పట్టు చిక్కించుకుంది.

కాసేపు గిజగిజ లాడాడు పరబ్రహ్మం. ఒడుపుగా "చూడూ ఇట్లాంటి లోతైన విషయాలు నీకు తెలీవు పురుకో" అని గాట్లో పడుతూ అన్నాడు. "వంకాయ కూరలో ధనియాల పొడి వెయ్యమని ఎందుకన్నా నంటావు? అంతేగా? ఎందుకన్నా నంటే, దాక్షిణాత్య సంస్కృతిలో తెలుగు, కన్నడ సంస్కృ తులు పరస్పర పూరకాంశాలు కాబట్టి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తెలుగు కన్నడ సంస్కృతులనే రెండు అంతర్వాహినుల సంపూర్ణ సంక్షోభ రూపమే దాక్షిణాత్య సంస్కృతి. ఇవ్వాళ్టి రోజా కూర అట్లా కాదు. పూర్ణం వంకాయ అచ్చు తెలుగు కూర. 'దేశ్యంబులగు శాక పాకాదులయం దన్య దేశ్యంబులు, తత్సమంబులు నగు దినుసులు పరిత్యజ్యంబులగు' నని నన్నయసూరి సూత్రం. అందువల్ల ఇవ్వాళ నువ్వు పూర్ణం వంకాయలో నువ్వులపొడి కాకుండా బాధ్యతా రహితంగా ఉల్లిపాయ కారం దంచి పారేస్తే కాదు అందుకు నిన్ను నేను క్షమించినా ఆ భగవంతుడు మాత్రం క్షమించడు, సుగుణా, ఆ భగవంతుడు మాత్రం క్షమించడు (కుడి చూపుడు వేలు అడ్డంగా ఊపుతాడు.)"

"ఫూ. పర్లేండి" మూతి ప్రయోగం శిరిష్యే తరవాత అన్నది సుగుణ. "ఈ మధ్య మాటలు బాగా నేర్చారు లెండి మీరు. హుఁ. ఇంతకీ ఇవ్వాళ్టి కూర బాగా లేదన్న వాళ్ళని మిమ్మల్నే చూశాను!"

అసంతృప్తిగా తేనుస్తూ పరబ్రహ్మం వరండా లోకి వచ్చాడో లేదో లోపల నుంచి "ఏమండోయ్, అర్జంటుగా ఒక మా రిలా రండి" అని కేకవేస్తూ వచ్చేసింది సుగుణ. "ఎన్ని సార్లు చెప్పానో మీకు ఇట్లా ఒకసారి వచ్చి ఆ అంట్లు చూడండి. గంపెడు తయారైనాయి. ఇవి కాగానే పిల్లల బట్టలు, మీ బనీన్లూ అవీ పైజమాలు, బండెడు, నా హత మారుతూంది. ఒక పనిమనిషిని చూడండని చెప్పి చెప్పి నా నోరు నొప్పెడుతూంది. మీకు చీమ కుట్టి నట్టు లేదు."

"ఎందుకు లేదూ! అయినా నా కెప్పుడు చెప్పావు నువ్వు?" ఆశ్చర్యం చూపుతూ అన్నాడు పరబ్రహ్మం.

"చెప్పకపోతే మాత్రం?" సమయస్ఫూర్తితో పని తీసుకుంటూ అంది సుగుణ.

"శాంతమ్మ మానేసి వారం రోజులు కావ స్తూంది గదా. పోనీ ఆ సంగతి తెలుసా, తెలీదా?"

"అవును. తెలుసూ" అని పరబ్రహ్మం తలూపగానే.

టక్కున పాయింట్ పట్టేస్తూ "మరి ఆ సంగతి తెలిసినప్పుడు ఇంకో పని మనిషి కావాలని తెలీదా? అదీ నేనే చెప్పాలా?" అంటూ తరుక్కు పోయింది సుగుణ. "కూర బాగులేదూ, పచ్చట్లో పసుపు తక్కువయిందీ అంటూ ఆరళ్ళు పెట్టడం మాత్రం తెలుసు మీకు. రోజూ ఆ గంపెడు అంట్లు ముందేసుక్కూర్చుంటున్నానా? బండెడు బట్టలా? పోనీ సాయం చెయ్యకపోతే మానె— ఒక్కసారేనా 'అయ్యో, పాపం!' అన్నారా మీరు? మొన్న కమ్లా, విష్ణూ, మంగ్లా పరమేశ్వరూ వచ్చినప్పుడు అంట్లు తోముతూ కూర్చున్నాన్నేను. తలకొట్టేసినట్లయింది నాకు."

"నువ్వట్లా బాధపడటం అనవసరం, సుగుణా— ఒకరితో మనకేంటే మన పని మనం చేసుకుంటే తప్పేమీ లేదు." అనునయంగా అన్నాడు పరబ్రహ్మం.

"ఆహా! ఏం చెప్పారండీ! ఇంకేం రేపటినుంచి మీ బనీన్లూ అవీ మీరే ఉతుక్కోండి."

గతుకితుడైనాడు పరబ్రహ్మం. సుగుణ వాదన ముందు—అశ్వధాటివంటి ఆమె తర్క ధాటి ముందు ఎన్నడు నిలవగలిగాడు తను! ఇట్లాంటి సందర్భాల్లో తనకు అనిపిస్తూంటుంది పెళ్ళి అనే రోట్లో తల పెట్టే అమాయక యువకులకు 'గృహతర్కం' అనే క్లిష్టమైన విద్యను బోధించాలి. అందులో పరీక్ష పెట్టి ఉత్తీర్ణులైనవారికే వివాహాను

మతి ఇవ్వాలి. వాళ్ళ బోధనల, శిక్షణలకోసం సుగుణవంటి గృహిణుల వాదనల్ని టేప్ చేసి, ప్రభుత్వ పబ్లిసిటీతో చవక ధరలపై కేసెట్ల రూపంలో విడుదల చెయ్యాలి.

ఆలోచనల్లోంచి బయటకు వచ్చి—"అసలు శాంతమ్మకు జీతం పెంచేస్తే పోయేదేమో" అన్నాడు, గత పనిమనిషిని తీసెయ్యడం పొరబాటే నన్నట్లు ధ్వనిస్తూ.

"ఎందుకండీ! అయిదు సంవత్సరాల నుంచీ లేనిది ఇవ్వాళ అడిగిందే తడవుగా ఇరవై అయిదు నుంచి ముప్పయి అయిదుకి పెంచాలా? ముప్పై అయిదు రూపాయలంటే కాసిన్నా? అస లంత పనేముందనీ మనింట్లో! నాలుగంట్లు తోమటమూ, నాలుగు గుడ్డలుతకడమూ, ఇంటి ముందు కాస్త వూడ్చి చల్లి నాలుగు ముగ్గు కర్రలు వెయ్యడమూ, వారాని కోసారి ఇల్లు కడగటమూ—అంతేగా! ఈ మాత్రానికే ముప్పై అయిదు రూపాయలా! ఆశ కంతుండాలి. మళ్ళా రోజూ పొద్దున్నా, సాయంత్రమూ టీ పోస్తున్నానా?"

'ఏంటివిగా వాయినా' అన్నట్లు తలూపింది శాంతమ్మ పరబ్రహ్మం మనసులో మెదిలి. పాపం! ముప్పై అయిదిమ్మని ఆమె అడగటం అన్యాయమే.



అడక్కుండా ఏభై కి పెంచకపోవడం అధర్మమే. కానీ ఆ మాటంటే ఇంకేమున్నా ఉందా!


"నేను కనుక్కుంటాలే మా చౌకీదారు ఎరికైనా ఎవరన్నా పనిమనుషులున్నారేమో" అని ప్రస్తుతానికి తప్పించుకున్నాడు.

• • • •

ఒక మధ్యాహ్నం వసంతా అయ్యాక సోఫామీద చేరగిలబడి విశ్రాంతి తీసుకుంటూన్నప్పుడు. సుగుణకు వీధి తలుపు చప్పుడు వినిపించింది.

"బ్రమ్మంసార్ బంపించిండమ్మా" అంటూ యాభై ఏళ్ళతనూ, ఆ ప్రక్కన ఇరవై ఏండ్లుంటా యేమో ఒక పిల్లా వచ్చారు. "పనిమనిషి గావాలంటగదమ్మా?"

ప్రాణం లేచొచ్చింది సుగుణకు. 'నే పోరగా పోరగా ఇన్నాళ్ళకు తనూ ప్రయోజకుడైనారన్నమాట' అని సంతోషపడుతూ "అట్లా కూర్చోండి బాబూ" అంది బెంచీ చూపిస్తూ.



"ఫరవాలేదమ్మ" అంటూ అతను నిల్చునే ఉన్నాడు. ఆ పిల్ల మాత్రం కూచ్చుంది.

"నీ పేరేంటి?" తొణుకూ బెణుకూ లేకుండా కూర్చున్న ఆ పిల్లను అడిగింది సుగుణ.

"పోచ్‌లక్ష్మి."

ఉలికిపడి సరిగా కూర్చుంటూ అడిగింది సుగుణ "ఏం లక్ష్మి అన్నావూ?"

"పో—చి—ల—క్ష్మి" అం దా అమ్మాయి వొక్కి పలుకుతూ.

"ఏమైనా చదువుకున్నావా ఏం?" అనుమానంతో చూసింది సుగుణ.

"పదిలో మూడు ప్యాసయినా..." కనురెప్పలు గర్వంగా వాల్చింది పోచిలక్ష్మి.

"ఏమయినా అనుభవం ఉందా? ఎన్నిండ్లలో పని చేస్తున్నావు?"

"మూడిండ్లళ్లో పని చేస్తున్నా పదిలో మూడు ప్యాసైనప్పటికెల్లి..."

"సంవత్సరం అనుభవం ఉందన్నమాట..." హాండాగా కండ్లు చిట్లించింది సుగుణ.

"పదిలో మూడు ప్యాసైనప్పటికెల్లని చెబు తున్నాగా మూడేండ్లు" అన్నది పోచిలక్ష్మి గదమాయింపుగా.

నివ్వెరపోతూనే 'హోహో అట్లాగా' అని సర్దుకుపోయింది సుగుణ. మనసులో మహిళా మండలిలో జరిగిన చర్చలో వ్యక్తమైన ఏకాభి ప్రాయాన్ని గుర్తు చేసుకుంటూ 'స్కూటరూ కాదు, టీ.వీ. కాదు, ఫ్రిజ్జు కాదు. నిజమైన స్టేటస్ సింబల్ పనిమనిషే. పనిమనిషే నిస్సందేహంగా పనిమనిషే!

"మా ఇంట్లో పని అట్టే ఏమంత ఉండదు. చూడు పోచిలక్ష్మి. కాసిని అంట్లు తోమడమూ నాలుగు బట్ట లుతికేయడమూ, పది రోజులకొకసారి ఇల్లు కడగడమూ...సరే పాచిపని—దానిదేముంది— చెప్పు ఎంతిమ్మంటావో?" తూచి తూచి మాట్లాడుతూ పోచిలక్ష్మివంక చూసింది సుగుణ.

పోచిలక్ష్మి కళ్ళు వాల్చింది. నవ్వింది. తలూపింది 'తెలుసులే' అన్నట్లు—"మూడిండ్లల్లో పని జేస్తున్న. ఒకింట్ల నలబయ్యా, ఒకింట్ల యాబయ్యా, ఇంకొకింట్ల యాభై అయిదూ సరే పో—దానిదేముంది— నీకాడ పది తక్కువే దీస్కుంటా— అరవయ్యిచ్చెయ్"

నిర్ఘాంతపోయినదానిలా కన్పించాలని చూసింది సుగుణ. "ఏంటీ—అరవై రూపాయలా? అరవై రూపాయలే! హు అరవై రూపాయల్ట!" సపోర్టు కోసం వెంట వచ్చినతనికేసి చూసింది.

కొంచెం చులకనగా చూసింది పోచిలక్ష్మి. "మూడేన్ల నుంచి జేస్తున్న గన్క తక్కువ దీస్కుంటున్న—ఇంకెవరిల్లయిన డెబ్బైకి తక్కువ వచ్చేదే లేదు. మా కక్క జెప్పిండు గనక మీకరవై జెప్పినా" అంటూ లేచింది.

"ఉండుండు అట్లా వెళ్ళిపోకు మరీ" అంది సుగుణ కంగారు కన్పించకుండా ఉండాలని చూస్తూ. 'చూస్తూ చూస్తూ ఇంటికొచ్చిన పని మనిషిని వెళ్ళగొట్టుకొంటుందా ఏ ఇల్లాలైనా!' "మరీ అట్లా మంకుపట్టు పట్టుక్కూర్చోకు పోనీ నలభై చేస్కో."

"లేదమ్మా బేరమాడే పన్లేదు. ఒకేమాట జెప్పినా మా కక్క జెప్పిండని ఆకరు మాట యాభై అయి దిచ్చెయ్."

"యాభై అయిదూ లేదూ ఏమీ లేదు. నలభై అయిదు జేస్కో మా ఇంట్లో ఏమంత పనిగూడా ఉండదు. నాలుగంట్లూ నాలుగు బట్టలూ సరే పాచి పన్దేవుందిలే నలభై అయితీస్కో."

"లేదమ్మా నాలుగు మాటలు జెప్పేదాన్ని గాదు కక్క జెప్పిండనిగాని. ఒకటే మాట. యాభై ఇచ్చెయ్."

"ఇహ నీ ఇష్టం." వోపిక లేనిదానిలా కన్పించాలని చూస్తూ తల వేళ్ళాడేసింది సుగుణ. "నాలుగంట్లూ నాలుగు బట్టలూ...నలభై అయిదు నీ కిష్టమైతే రేపట్నించే రా పంచమి మంచిరోజు."

తనూ అలాగే కన్పించాలని చూస్తున్నట్టు కన్పించింది పోచిలక్ష్మి. "యాభై రూపాయలు ఇష్టమైతే చెప్పండి మరి రేపట్నించి ఒస్త పొద్దుగాల ఎన్నింటికి రావాల్నో చెప్పు'

"పొద్దున్న ఏడున్నరకల్లా పని అయిపోవాలి. ఆరు ఆరుంబావుకల్లా రావాలి. ఏంటి మరీ? నలభై అయిదు?"

"ఆరింటికైతేనే నాకూ ఈలుగా ఉంటుంది. నలభై అయిదు లేదేం లేదు యాభై. పొద్దు గాలొస్త" అంటూ లేచింది పోచిలక్ష్మి. "ఎల్లొస్త పొద్దుగాలొస్త" అంటూ కక్క వెంటరాగా వెళ్ళి పోయింది పోచిలక్ష్మి.

"! !" సుగుణ నోరు అట్లానే ఉండి పోయింది. 'ఇంతకీ నలభై అయిదా యాభైయ్యా? యాభై అనుకుని వెళ్ళిందేమో? నలభై అయిదేనని మరోసారి ఖచ్చితంగా చెప్తే బాగుండేదేమో? లేకపోతే నలభై అయిదే ఇస్తారని రాకుండా పోతుందో ఏమో? పోని పిల్చి యాభయ్యే తీస్కుందూగాన్లే అని నమ్మకంగా చెబితే బాగుండేదేమో?'

తీవ్రమైన సంఘర్షణలో పడిపోయింది సుగుణ మనస్సు.

ఇదే చాన్సని సుగుణ లోంచి తెల్లటి అంతరాత్మ బయటికివచ్చి ఎడమ ప్రక్కన నిల్చుని అంది: 'గృహిణిగా నీ పవిత్రమైన బాధ్యత నువ్వు విస్మరించావు. నీ భర్త ఎంతో కష్టపడి జాడ తెలుసుకుని పంపించిన పనిమనిషి పోచిలక్ష్మిని కేవలం అయిదు రూపాయలకు లోభించి పోగొట్టావు. అర్ధాంగిగా నువ్వు నీ కర్తవ్యాన్ని నిర్వహించలేక పోయావు. నీ భర్తను గౌరవించలేకపోయావు.'

వెంటనే నల్లటి అంతరాత్మ బయటికి దూసుకు వచ్చి కుడి ప్రక్కన నిల్చుని అంది: 'హు! అయిదు రూపాయలంటే మాటలా! ఒక్కోసారి ఆ అయిదు రూపాయలు దొరక్క ఆయన తిరగమోత డబ్బాలు

వెదుక్కురాటుంటారు. అయినా అయన సంపా దించిన అయిదు రూపాయల్ని గౌరవిస్తే అయన్ను గౌరవించినట్లు కాదా?' దూకుడుగా 'మాటల్జెప్ప గానే సరా—పొదుపు చేసేవాళ్ళకి తెలుస్తుంది' అంటూ జవాబు ముగించింది.

దానిపై శ్వేతాంతరాత్మ నిగ్రహం కోల్పోకుండా చిరు నవ్వుతో, ప్రశాంతంగా మరో పాయింటు తీసింది. ప్రతిపక్షమైన నల్లాంతరాత్మ వూరు కుంటుందా! మళ్ళీ రెండు దులుపులు దులిపి మరీ వదిలింది. 'ఒళ్ళు నలగకుండా, చీర మాయ కుండా, తెల్లటి బట్టలు వేసుక్కూర్చొని వూరికే ధర్మపన్నాలు వల్లిస్తుంటావు' అంటూ నడుం చుట్టూ చీర బిగించి కొప్పు గట్టిగా ముడిచి సిద్ధం కూడా అయింది.

ఇంతలో ఎవరో తలుపు దగ్గర నిల్చుని పిల డంతో ఇద్దరూ తమ 'వంట్లో' కి వెళ్ళారు.

ఆ ఒక్క రాత్రి గడిచేసరికి రెండు రాత్రుల గడిచినట్లనిపించింది సుగుణకు. పోచిలక్ష్మి మరునాడు ఉదయం ఇంటి ముందరిదాకా వచ్చి పెద్దవాడికి కనిపించి 'యాళ్లై' ఇయ్యనన్నది—మీయమ్మ పనికి నే నొస్తలేను' అని వెళ్ళిపోతున్నట్టూ, తనకు పెద్దా డీ సంగతి చెప్పగానే తాను 'పోచిలక్ష్మి, వెళ్ళకు—వెళ్ళకు, పోచిలక్ష్మి—నీ ఇష్టప్రకారమే యాభై తీస్కుందూగాని, పోచిలక్ష్మి' అని అరుస్తూ వరండాలోకి పరిగెత్తినా పిలుపు అందక పోచిలక్ష్మి మూల మలుపు తిరిగి అదృశ్యమైనట్టూ పీడ కల వచ్చింది. ఆ తరువాత నిద్ర పట్టక పట్టక పడితే మరో పీడ కలా! కుడి ప్రక్కన అంట్లూ, ఎడమ ప్రక్కన ఉతకవలసిన బట్టలూ వేసుకుని తను నల్లా దగ్గర కూర్చుని ఉండగా, పిల్లలు ఎంగిలి కంచాలూ, గ్లాసులూ తెచ్చి పడేస్తున్నట్టూ, 'వారే' మో వికటాట్టహాసం చేస్తూ వూరికే పైజమాలూ, బనీన్లూ అవీ విడిచి గుట్టలు పోస్తున్నట్లూ! !

నిలువెల్లా చెమటతో లేచింది సుగుణ. అటుప్రక్కన మంచం మీద అమాయకంగా నిద్ర పోతున్నాడు భర్త, పాపం! ఆ నైట్ షర్టూ, పైజమాలూ నిన్న రాత్రి చంటివాడు తడిపినవే.

మరునాడు పొద్దున్నే పోచిలక్ష్మి వచ్చి డ్యూటీలో చేరితే కొబ్బరికాయ కొడతానని మొక్కుకుంది సుగుణ, దగ్గరలోనే రోడ్డుప్రక్క ఈ మధ్యే ప్రాక్టీసు పెట్టిన ఒక దేవతకి.

మరునాడు ఆదివారం. ఉదయం అంతా ఇడ్లీలు ఆరగిస్తుండగా ఇంటి ముందు చిన్న కర్ర ముక్క పట్టుకుని పెత్తనం చేస్తున్న చంటి జారిపోతూన్న లాగు పైకి లాక్కుంటూ వంటిం ట్లోకి వచ్చి వచ్చీరాని మాటల్లో "అమ్మా, వొచ్చి అచ్చి—అచ్చి—వొచ్చి—అచ్చి—అచ్చి" అన్నాడు.


తనూ అదే ధ్యాసలో ఉందేమో అర్థం చేసుకుని 'హమ్మయ్య' అంది సుగుణ సంతోషంతో. "వచ్చేసిందిటండీ పోచ్‌లక్ష్మి— వచ్చేసిందిటండీ! మొత్తానికి మొక్కుకున్నందుకు మాట నిల బెట్టిందండీ దేవత! ఇట్లా ఉండాలి దేవతంటే!"

ఆ సంతోషంలో పాలువంచుకుంటూ ఉత్సాహంగా కనుబొమ ఎగరవేస్తూ "ఎవరూ? ఎవరన్నావూ? జ్యోతిలక్ష్మా! జ్యోతిలక్ష్మి?" అన్నాడు పరబ్రహ్మం లేస్తూ.

"నా మొహం—మీకు లేచిందగ్గర్నించీ జ్యోతి లక్ష్మిలూ, జయమాలిన్లూ" అంది సుగుణ విసుగ్గా. "ఉండండి—నానా అవస్థలు పడి కుదుర్చుకున్నాను— ఏదో ఒహ లక్ష్మి—కాస్త ఇక్కడే ఉండి పిల్లలకు చట్నీ కావాలో, సాంబారు కావాలో చూస్తూండండి. ఆ నెయ్యి జాగ్రత్త. ఇప్పుడే వస్తా" అంటూ వరండాలోకి వెళ్ళింది.

విన్నటికంటే కొంచెం ఒద్దికగా "నమస్తమ్మా" అంది పోచిలక్ష్మి.

నమస్కారాన్ని స్వీకరిస్తూ ముక్తసరిగా 'ఆఁ వచ్చేవా పోచిలక్ష్మి. ఏడున్నర దాటితే ఇహ నువ్వు రావేమో ననుకున్నా. నలభై అయిదుకు పనిజెయ్యడం నీ కిష్టం లేదేమోననుకుని ఇప్పుడే మావారితో చెబుతున్నా ఇంకెవరినయినా చూడండి అని' అంది సుగుణ.




వినయంగానే అంది పోచిలక్ష్మి—"అదేనమ్మ. నేనందుకే వచ్చినా—నాకోసం ఎదరజూస్తుంటరేమో నని చెప్పి పోదామని వచ్చిన. నలభై అయిదుకైతే ఇంకెవుర్నయిన జూస్కోండి—నాకూ ఇంకో ఇల్లు దొరికేటట్లుంది."

ఇహ ఏం చేయాలో తెలియని సుగుణ మళ్ళీ ఇందాకటి దేవతని ఇట్లా స్మరించుకుందో లేదో అట్లా మెరుపులాంటి ఆలోచన వచ్చింది. చప్పున ఉదాసీనంగా ఉన్న ముఖాన మందహాసాన్ని పులిమి అంది—"మొత్తానికి గడుసుదానివే పోచిలక్ష్మి! ఏమో అనుకున్నా—చివరి కైదు రూపాయలకోసం నా మాట తీసివెయ్యడానిక్కూడా సిద్ధపడ్డావన్న మాట! సరే పోనీ నీ మాటే నిలబెట్టుకో. ఏభయ్యే చేసుకుందు గాన్లే రా పన్లో చేరుదూగాని."

"అయ్యో నిన్ననే చెప్పొద్దా 'అక్కా'. తొమ్మిది గొట్టేతలికి మా నాయనోండ్ల ఆఫీసరుగారింటికి పోవాలె. ఏది లేటయినా అది లేటుగాని క్కుదర్దు" అంది పోచిలక్ష్మి వరస మార్చేస్తూ.

సుగుణ చొరవగా వరండా మెట్లు దిగింది. 'నువు నా మాట విను పోచిలక్ష్మి నీకంటే పెద్దదాన్ని. ఇవాళ పంచమి మంగళవారం మంచిరోజు. లాంఛ నంగా రెండు చెంబులు తోమి వెళ్దూగాని' అంటూ చనువుగా పోచిలక్ష్మి చెయ్యి పట్టుకుని ఇంట్లోకి లాక్కుపోతూంటే 'కాదన్లేక పోతున్ననక్కా' అంటున్నట్లు నవ్వుతూ అనుసరించింది పోచిలక్ష్మి.

తూపరాసీ దగ్గర పొద్దున్నే తోల్చిన అంట్ల బాపతు చెత్తతో అసహ్యంగా ఉందనిపించి కాసిని నీళ్ళు పోసి చీపురుతో అవతలికి నెట్టేసింది సుగుణ. ఆ తరువాత లోపల్నుంచి ప్రారంభోత్స వానికి ఎంపిక చేసిన చెంబుత్రయమూ, చింత పండూ తెచ్చి పెట్టి తూపరాసీ దగ్గర పీటొకటి వేసి గబగబా వెళ్ళి కుంకుమ భరిణె తెచ్చి తను పెట్టుకుని పోచిలక్ష్మికీ పెట్టి ప్రతిష్ఠ చేసింది.

పీట మీద కూర్చుని అంట్ల చీపురు చేతిలోకి తీసుకుంటూ విలాసంగా నవ్వింది పోచిలక్ష్మి దండ వేయించుకుని పుష్పగుచ్ఛం తీసుకున్నాక ముఖ్య అతిథి నవ్వినట్లు. ఆ నవ్వుతోనే ఒయ్యారంగా తూపరాసీ మీద అంట్ల చీపురుతో రెండు సుతారమైన ఝుళుపులు ఝుళిపించింది.

ముగ్ధురాలై పోయింది సుగుణ. "నువ్వు కాని స్తూండు లక్ష్మి. నేను కాఫీ నీళ్ళు పెట్టొస్తా" అంటూ వంటింట్లోకి వెళ్ళబోతూన్నదల్లా నోరు తెరచి చూస్తున్న పరబ్రహ్మన్ని గమనించి ఆగి పోయింది. 'ఏమి టా చూపు!' అన్నట్లు భృకుటి ముడిచి.

"ఏమిటా చాదస్తం సుగుణా! ఆ బొట్టూ ఆ పీటా..." ఆక్షేపణగా అన్నాడు పరబ్రహ్మం.

"ఇష్—పెద్దగా మాట్లాడకండి." నొక్కిన గొంతుతో మాట్లాడుతూ భర్తను లోనికి లాక్కుపోయింది సుగుణ. "మీ కెందు కదంతా? ఆడవాళ్ళ ఆచార వ్యవహారాలు మీకేం తెలుసు? ఇవ్వాళ పంచమి. మంగళవారం. ఆ పిల్లపేరు లక్ష్మి. పైగా భాద్రపద మాసం కూడా."

"అయితే?" చికాగ్గా అన్నాడు పరబ్రహ్మం. "లక్ష్మిని పీట మీద కూర్చోబెట్టి చీపురు చేతికీనా?"

నిల్చుని తీక్షణంగా చూసింది సుగుణ. చెప్పొద్దూ. తనకీ కోపం వచ్చింది. ప్రతిదానికీ మగా ళ్ళిట్లాగేనా అడ్డుపడటం! "అసలు దేవతల వ్యవహారం మీకేం తెలుసండీ? ఒక్కో దేవతకి ఎన్ని మూర్తులు? ఒక్కో మూర్తికి ఎన్ని చేతులు, ఒక్కో చేతిలో ఏముంటుందో తెలుసా మీకు? చిన్నమస్త ఎట్లా ఉంటుందో తెలుసా? శీతలాదేవి వర్ణన విన్నారా? మార్జన్నీకలశోపేతాం—శూర్పాలం కృత మస్తకాం—రాసభస్థాం—దిగంబరీం. ఆఁయ్! ఆఁఏమనుకున్నారో ఏవో!' అంటూగుడ్లురిమినదియూ భ్రుకుటి ముడిచినదియూ, వేగముగా అడుగులు వేసినదియూ, వంటింట్లోకి నడిచినదియూనైంది సుగుణాదేవి.

ఆమె అడుగుల చప్పుడులో హ్రాం, హ్రీం, హ్రూం, హ్రైం, హ్రౌం, హ్రం, హ్రః ధ్వనించి వాక్కు లేనటువంటి వాడునూ, దిగ్భ్రాంతిచేత చుట్టగా చుట్టబడినటువంటివాడునూ, అడుగులు వేయనటువంటి పాదములుగలవాడునూ అయినాడు పరబ్రహ్మం.

ప్రారంభోత్సవం ముగియగానే టిఫినూ, కాఫీ తీసుకుని వెళ్ళిపోయింది పోచిలక్ష్మి.

• • • •

వారం గడిచిందో ఏమో ఒక రాత్రి పరబ్రహ్మంతో అతను వాకబు చెయ్యకపోయినా అంది సుగుణ: "మొత్తానికి భలే చురుకైన పిల్లండీ పోచిలక్ష్మి. అంట్లపనీ, పాచిపనీ అంత సుబ్బరంగా రాదనేగాని, తెలివైన పిల్లండి. ఎంత చక్కగా విమర్శిస్తుందో సీరియల్ నవలల్ని. బోలెడు ఉత్తరాలు అచ్చయి నాయట అనేక పత్రికల్లో. వీలు చూసుకుని అందులో మంచి ఉత్తరాలన్నిటినీ కలిపి ఒకే పుస్తకంగా వెయ్యాలని ఆలోచిస్తుందట."

"ఒఁయ్!" అన్నాడు పరబ్రహ్మం ఆసక్తిగా. "శేన్సుకి అంతస్తుతో సంబంధం ఏమిట్లే, కానీ ఏ పత్రికలోనూ పేరు చూసినట్టు లేదే!"

"వేరే వేరే పేర్లతో రాస్తుందట. మొన్నీ మధ్యనే ఒక కథ కూడా రాసి పంపించిందట."

"ఏం పేరుతో పంపించిందట? ముందే కనుక్కో. గ్యాన్‌గాని కొడుతూందో ఏమో."

"నర్లెండి. మీతో ఇన్నాళ్ళూ కాపరం చేశాక ఆ అనుమానం రాదా ఏం నాకు? అడిగా. కథ పడగానే చెప్తానంది. ఇంతకుముందు కొన్నాళ్ళు తన కలం పేరు 'టామీ' అట" అని ఆ వెంటనే పరవశించిపోతూ అంది సుగుణ, 'ఏమండీ, మరో సంగతి—తన కథ అచ్చయ్యాక నాకు కూడా ఒక కథ రాసిస్తానందండీ!"

"ఇంకేం మరి. ఆ కథని 'మోతీ' అనే కలం పేరుతో నువు పంపించు. అది అచ్చయ్యాక 'జిమ్మీ' అనే పేరుతో ఆ కథ చాలా బాగుంది. మళ్ళీ ప్రచురించండి అని ఉత్తరం రాద్దుగాని!"

ఆ వెటకారంలో రవ్వంత ఈర్ష్య కనిపించింది సుగుణకి. "అబ్బ! మీకెంత అలుసండీ పని మనిషంటే!" విమర్శనాత్మక దృక్పథంతో భర్తని చూస్తూ అన్నది. "పనిమనిషైనంత మాత్రాన రచయిత్రి కాగూడదా? ఆమె మనిషి కాదా? ఆమెలో నెత్తురు లేదా? హాఁ! ఇంతగా పురుషాహంకారం ఉన్నవాళ్ళని మిమ్మల్నే చూస్తున్నాను."

కంగారుగా అపోహని తొలగించే ప్రయత్నంలో పడ్డాడు పరబ్రహ్మం. "అహఁహాఁ. నా ఉద్దేశం అది కాదబ్బా. స్టేటస్‌కీ టాలెంట్‌కీ సంబంధమేంటి? ఆ మాటకొస్తే 'శారద' అనే కలం పేరుతో నటరాజన్ అనే సర్వర్ అద్భుతమైన నవలలు రాశాడు తెలుసా? పోతే లింగభేదానికొస్తే నా అభిమాన రచయిత్రి ఎవరో తెలుసా? 'విరోచన'. శృంగారరసాన్నీ, దుఃఖ రసాన్నీ ఉప్పుకారాల్లాగ సమపాళ్ళలో కలిపి బీభత్సరసంతో తిరగమోత పెట్టగల ఏకైక రసయిత్రి—పసయిత్రి."

"అదీ మీరే అంటారు, ఇదీ మీరే అంటారు!" నిశితమైన విమర్శ చెయ్యాలనిపించిందేమో మంచం మీది నుంచి లేచి కుర్చీలో కూర్చుంటూ అంది సుగుణ. "అయితే ఈ ఒడ్డూ లేకపోతే ఆ ఒడ్డూ! మీ సంగతి ఇవ్వాళ కొత్తా నాకు! నాలికని ఎటువడితే అటు తిప్పడం నేర్చారు!"

విస్తుపోయినాడు పరబ్రహ్మం. పురుషాహంకారం ఉన్నవాడైతే విరోచనను గురించి తాను అట్లా మాట్లాడ్తాడా! అపోహను తొలగించే ప్రయత్నంలో అన్నాడు. "అన్యాయంగా అభాండాలు వేస్తున్నావు, సుగుణా. అవసరానికి మించి వెంట్రుక మందంకూడా తిరగదు నా నాలిక. ఆ మాటకొస్తే సంస్కృత భూయిష్టమైన సమాసాలు చదివేటప్పుడు ఒక్కొక్కసారి అవసరమైనంత కూడా తిరగదు."

"ఇంక ఏమీ మాట్లాడకండి" వాదన ముగిస్తూ అంది సుగుణ. "మీ నాలిక సంగతి నాకు తెలీదా! పూర్ణం వంకాయనాడే తేలింది. మిగిలిందేమైనా ఉంటే పొట్లకాయ పెరుగుపచ్చడినాడు పూర్తిగా బయటపడిపోయింది."

తడిమి చూసుకున్నాడు పరబ్రహ్మం "ఇంక నీ ఇష్టం. పోచిలక్ష్మి చురుకైందని నేనూ అంగీకరిస్తున్నాను. రేపొద్దున్నగానీ, ఎల్లుండి సాయంత్రం కానీ ఆ పిల్లే గొప్ప రచయిత్రిగా గుర్తింపు సంపాదించవచ్చు.'

• • • •

ఆ ఉదయం పొద్దెక్కిన తరువాతగూడా కాలూమీద కాలు వేసుకుని ఆనందంగా పడుకునే ఉన్నాడు పరబ్రహ్మం, 'ఆఫ్' గనుక.

రేడియోలో నుంచి 'బ్రహ్మమొక్కటే—పరబ్రహ్మమొక్కటే—పరా — బ్రహ్మమొక్కటే' వస్తూంది.

తూపరాసీ దగ్గర్నించి నేపథ్య సంగీతం వస్తూంది. మధ్య మధ్య సంభాషణవున్నూ.

ఆసక్తిగా కిటికీ సందులోంచి చూశాడు పరబ్రహ్మం.

పీట మీద కూర్చుని చేతులు తిప్పుతూ అభినయ సహితంగా మాట్లాడుతూంది పోచిలక్ష్మి. 'నువ్వేమయిన జెప్పు, సుగుణక్కా. 'చిక్కుబడిన అనుబంధం' నవల్లో గణేశ్‌కుమార్‌కి ఉచితకీ పెండ్లి జేసి హీరో హితాశ్‌బాబుని అమెరికాకి బంపిస్తే బాగుండేది. 'ఇడిపోయిన సంబంధం' నవల్లో నాయిక లూనా మొగుడు బెట్టే బాదల్ని బరించటంకంటే, పుస్తె తాడు పుటిక్కున తెంపి మొగుడు చేతక్ మీది కిసిరేసినట్టూ చేతక్ గుర్రవ్వందాలకోసం రంయిన ఎల్లిపోయినట్టూ రాస్తే బాగుండెడ్డి."

దిగ్గున లేచి మంచం మీద నిటారుగా కూర్చున్నాడు పరబ్రహ్మం.

స్టూల్ మీద కూర్చుని చుబుకం కింద చెయ్యి పెట్టి తదేక దీక్షగా వింటూందల్లా వాస్తవ జగత్తులోకి వస్తూ "అయ్యయ్యో పోచిలక్ష్మి" అంది సుగుణ నవ్వులోనే ఆందోళన కనపరుస్తూ. 'ఆ గిన్నె చూడు మసీ పోలేదు అంటూ వదల్లేదు.'



తోమి పడేసిన గిన్నెల్ని ఏకమొత్తంగా చూస్తూ "అన్నీ నీ ముందే తోమినాగా సుగుణక్కా!" అంది పోచిలక్ష్మి నింద భరిస్తున్న అమాయకురాలి ముఖంతో.

"అహాఁ. అది కాదు. తోమేవులే. కాదంటున్నానా?" అపార్థం చేసుకోకు, లక్ష్మి అన్నట్లు ముఖం పెట్టింది సుగుణ. 'ఇత్తడి పాత్రలు తోమే టెక్నిక్ నీకింకా బాగా రాలేదు లక్ష్మి' అని సంశయంగా అటూ ఇటూ ముఖ్యంగా పరబ్రహ్మం పడుకున్న గదివైపూ చూడసాగింది.


"మరి నే పని జేసే ఇండ్లన్నింట్లో స్టీలు గిన్నెలే. మీ ఇల్లు బట్టినప్పట్నించే నే నిత్తడి బొసన్లు తోమటం. నేనైతే తోవుఁ తానే ఉన్నాగా."

"ప్చ్. నా ఉద్దేశం అది కాదు పోచిలక్ష్మి. నీకింకా ఆ సులువు తెలిసిరాలేదు" అని సంశ

యంగా మళ్ళీ చుట్టూ చూసి గొంతు తగ్గించి అంది సుగుణ: 'చూడూ. నువ్వు లేచి ఇవతలికి రా. నేను చూపిస్తా' అని లేచి పోచిలక్ష్మికి స్టూల్ చూపించి చప్పున తను వెళ్ళి ఆ పీట మీద కూర్చుంది.

ఆ పీట మహాత్యం ఎట్లాంటిదోగాని ఇహ ఆ పీట మీద కూర్చున్నాక ఎటువంటి సంశయ సంకోచాలూ లేకుండా తేటగా కన్పించింది సుగుణ ముఖం. ఎటొచ్చీ గదిలో పరబ్రహ్మం ముఖాన్నే పున్నమలంగా విభ్రాంతి.

"అసలు కూర్చోవటమే ఇట్లా కూర్చుంటే వీలుగా ఉంటుంది.' యోగాసనాలు నేర్పేదానిలా కాళ్ళూ, పాదాలూ సరియైన స్థానంలో ఎట్లా ఉంచాలో చూపుతూ వివరించింది సుగుణ. 'పూఁ. అయిందా? ఆ తరువాత ఎడమ అరచేతిని ఇట్లాయ్యిట్లా విస్తరించి. ఇత్తడి గిన్నెని ఎడమ అర చేతిలో య్యిట్లా వోరగా పెట్టాలి. ఏం?'




పోచిలక్ష్మి తెలిసిందన్నట్లు తలూపాక కొనసాగించింది. 'ఆ తరువాత కుడిచేతి మూడు మధ్య వేళ్ళపైన రెండు లేక మూడు గింజల చింత పండు మనం తోమాల్సిన పాత్ర పైన జనిబట్టి తీసుకుని ఏం?'

పోచిలక్ష్మి కండ్లు విప్పార్చి 'పూఁ' అన్నాక— 'ఏం అయిందా. ఇహ ఇప్పుడు చూడు' అంటూ చకచక చకచక తోమెయ్యసాగింది సుగుణ మధ్య మధ్య పోచిలక్ష్మి కండ్లలో మెచ్చికోలు ఉందో మాయమైందో గమనిస్తూ 'వెధవ పాత్ర ఇదొహ లెక్కా!' అన్నట్లూ.

శుభ్రంగా తోమేసినాక నీళ్ళు పోసి తొల్చి "ఇప్పుడు చూశావా, ఎంత మెరుపు కొచ్చిందో!" అంది.

"అవు. సుగునక్కా!" అబ్బురంగా చూస్తూ అంది పోచిలక్ష్మి. 'నేనంత బాగ తోమెడ్డ ఎన్నేండ్లకో!'

తన ప్రతిభకు ఈషణ్మాత్రమూ గర్వించకుండా పోచిలక్ష్మికి ప్రోత్సాహాన్నిస్తూ అంది సుగుణ: 'దాన్దేముంది పోచిలక్ష్మి. పుట్టుకతోటే ఎవరికీ రాదు ఏ 'విద్య' యినా అంతా అభ్యాసాన్ని బట్టే వచ్చేస్తుంది. కూర్చో కూర్చో. ఎన్నీ ఇహ వాలుగ్గీన్నలేగా! నువ్వట్లా కూర్చుని 'జన్మ జన్మల నిర్బంధం' గురించి కూడా కాస్త చెప్పు. నా కా ముగింపేమిటో అంతుబట్టి చావటం లేదు."

స్టూలు మీద కాలు మీద కాలేసుకుని పెటిలవుతూ "నీకొక్కదానికేగాదు సుగునక్కా. చాలా మందికి అర్థంగాలేదు ముగింపు" అంటూ వివరించింది పోచిలక్ష్మి. 'చిక్కువడిన అనుబంధం, ఇడిపోయిన సంబంధం—ఈ రెండూ సినిమాకి వనికొచ్చే కదలు. 'జన్మ జన్మల నిర్బంధం' చాలా గొప్ప నవలక్కా! ఈపారి అకాడమీ ప్రైయిజు దానికె రావాలె."

"హ్మ పూఁ హాఁ అహాఁ" అంటూ తన రొప్పుడూ రోజుడూ పోచిలక్ష్మి గమనించకుండా తిప్పలు బడుతూ మధ్య మధ్య "హ హాలాగా—హెందుకూ?' అంటూ ఆ వాలుగ్గిన్నెలూ కానిచ్చెయ్యసాగింది సుగుణ.

నోరు తెరిచి చూస్తుండిపోయినాడు పరబ్రహ్మం.

పోచిలక్ష్మి బ్రూ కాఫీ తాగి వెళ్ళిపోయినాక నాజూగ్గా ఆ విషయాన్ని తరచుతూ "ఏమిటి సుగుణా ఇవ్వాళ పాత్రలన్నీ మెరిసిపోతున్నయ్! ? మరి పోచిలక్ష్మికేవోఁ అంట్లు సనే రాదన్నావ్' అన్నాడు పరబ్రహ్మం.

"ఆఁ. ఏవుందండీ! ఇవ్వాళ నేనే తోమి చూపించాను. ఒకసారి, రెండుసార్లు అట్లా తోమి చూపించామనుకోండి. మరుసటిసారి శుభ్రంగా తోమేస్తుంది మరి" అనేసింది సుగుణ. అన్నాక పరిశీలనగా, అనుమానంగా భర్త ముఖంలోకి చూస్తూ 'అయినా అంట్ల సంగతి మీకెందుకు? ! అంథా కుండల్లో గుర్రాలు దోలే బుద్ధి!' అంటూ రుూడించి వంటింట్లోకి వెళ్ళి ఫటాల్న తలుపు వేసింది.

"ఇల్లు గలక్కల్లో నీయటువంటి అక్కలు నూటికి కోటిక ఒకరుంటారక్కా" అంది పోచిలక్ష్మి ఒక ఉదయాన.

మరొక ఉదయాన్న "ఇత్తడి, కంచు, రాగి, గిన్నెలు తోమడానికి నీకు నిన్నే సాటి అక్కా!" అంది.

ఇంకోసారి "చింతపండుతో ఇత్తడి నుంచి బంగారం బుట్టిస్తవక్కా నువ్వు!" అంటూ కితాబిచ్చింది.

తనకు ఇట్లాంటిపొగడ్త బొత్తిగాకొత్తయినప్పటికీ పొంగిపోలేదు సుగుణ. "ఆఁ. నాదేముంది పోచిలక్ష్మి. ఉత్త నిమిత్త మాత్రురాల్ని ఏదో భగవత్ప్రసాదంగా నా కీ కళ అబ్బింది" అన్నట్లు వినయంగా ముఖం పెట్టి పోచిలక్ష్మి మాటలు వింటూండి పోయేది.

వారం రోజులు తిరక్కుండానే టెరిలీన్, టెరీ కాట్, పట్టు, స్పన్ మొదలయిన బట్ట లుతక డంలో అవలంబించవలసిన ఆధునిక పద్ధతుల్ని గురించి తీసుకోవలసిన జాగ్రత్తల్ని గురించి ఒక్కొక్క రోజు ప్రదర్శనాత్మకంగా క్లాసులు తీసుకోవలసి వచ్చింది సుగుణకు. ఒకరోజు పరబ్రహ్మమే నిగ్రహం కోల్పోయిన కారణంగా. అయితే తను మాత్రం నిగ్రహం కోల్పోకుండా చాతుర్యంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చుకుంది ఆ రోజు.

సరిగ్గా నాలుగు గంటలకు బస్ కాచ్ చెయ్యడానికి ఫర్లాంగు దూరం వెళ్ళాలి.

మూడున్నరకి బట్టలు వేసుకుంటున్న వాడల్లా గావుకేక పెట్టినంత పని చేశాడు పరబ్రహ్మం.

"ఏంటండీ ఏమైందీ? ఎందు కలా అరుస్తున్నారు?" వంటింట్లో నుంచే పక్కింటి పిన్ని గారికి విన్పించేలా అంటూ వచ్చింది సుగుణ.

"ఏమీ కాకుండానే అరుస్తానా? అయినా ఈ మధ్యన విసుగెక్కువైంది నీకు."

"విసుగా!! విసుగేంటండీ" చోద్యమైన అప దం మొదటిసారిగా వింటూన్నట్లు విస్తుపోతూ అంది సుగుణ. 'ఇప్పుడు నే విసుక్కున్నానా! ఏమిటండీ?' అనడిగేను గానీ."

"నే మాటల్సంగతి మాట్లాట్టం లేదు. భావం నీ ముఖాన కన్పించిన విసుగు ఎక్స్ప్రెషన్‌గురించి అంటున్నాను. ఆ కనులలోన కనుబొమలలోన, భృకుటిపైన, భ్రూతలము పైన..."

"స్సారె!" చెయ్యి తిప్పేసింది సుగుణ." అది విసుగుభావంటండీ! హయ్యోరామ! ఆందోళనండీ ఆందోళన! నేనందుకే చెబుతాను. మీరు వారానికో సారయినా తెలుగు సినిమా చూడండి అని. చూస్తూ ఉంటే తెలుస్తుంది. మన తెలుగు విసుగూ తెలుగు కోపం తెలుగు ఆందోళనా ఎట్లా ఉంటాయో...లేక పోతే ఆ హిందీ ఇంగ్లీషు సినిమాలు చూసి చూసి ఇట్లాగే ఒక భావాన్ని చూసి ఇంకోటి అనుకుని అపార్థం చేసుకోవడం మన నాయకీ నాగమ్మా—మెల్లా మంగమాంబా."

పరబ్రహ్మానికి కోపం వచ్చింది. ఎడమ కన్నొను లాగిన బాణంలా పైకి ఎత్తి "భాషలు వేరయినా భావంఒకటే—పదములు వేరయినా నాట్యమ్మొకటే"

అని దీక్షైన జవాబిచ్చేడు.

"వూ. సర్లెండి ముక్కులు వేరయినా తుమ్ములు ఒకటే" ఫూళ్ళైన పారడీ చెప్పి "వ్వారికే ఎందుకలా అరుస్తారు!" అంటూ విసుగ్గా కనురెప్పలు వాల్చి చేత్తో పతాకం చూపి వారించింది సుగుణ. పరబ్రహ్మం తెల్లముఖం వెయ్యడం చూసిన తరవాత సంతృప్తి పడ్డ ముఖంతో "వూం ఏంటి సంగతి చెప్పండి? మీకొచ్చిన బాదేమిటి?" అనడిగింది.

"గుండీలు పోయాయి. సుగుణా గుండీలు పోయాయి." గంభీర విషాద నీరసం గొంతులో ఒలుకగా ఆ పాత్రలో జీవించేడు పరబ్రహ్మం.

"పోస్నిదేనా సంగతి నే నింకా ఏమిటో అనుకుని 'హడలి' పోతున్నాను. గుండీ పోతే గుండె ఆగిపోయినట్లు అరవాల్టండీ సేఫ్టీ పిన్ను పెట్టుకుంటే పోలే" అంటూ ఇస్త్రీ చేయించి పెట్టిన బట్టల జతలు తీసి తనిఖీ చేసింది సుగుణ. అన్ని షర్టుల గుండీలు పోగా ఒక్క నీలం రంగు చొక్కాకే దిగువన రెండు గుండీలు మిగిలినట్లున్నాయి ఆ రెండూ పక్కింటి తాతగారి పన్నులాగే చాన్స్ దొరికితే చాలనట్లున్నాయ్" ఈ పూట కీ నీలంషర్టు వేసుకెళ్ళండి. రెండు మూడు రోజుల్లో మిగతా షర్టులకి గుండీలు 'ఏర్పాటు' చేస్తాను" అని భర్త ముఖం లోకి చూసి అంది. "ఏంటి? ఆ గుండీలు కూడా పొయ్యేట్లున్నాయనా?" అని అర క్షణం గాఢంగా ఆలోచించి.

"ఉండనీ ఆ రెంటినన్నా ఉండనీ" అని పరబ్రహ్మం వారించేలోపునే.

మిగిలిన ఆ రెండు గుండీల్నూ వూడబీకి పడేసింది సుగుణ ఎక్కువ కష్టపడాల్సిన అవసరంలేని పళ్ళ డాక్టరులా.

ఆ తరవాత నిర్ఘాంతపోయిన పరబ్రహ్మం వైపు చూసి "ఎందు కలా విస్మరంగా చూస్తారు?" అంది సుగుణ నొచ్చుకున్న దానిలా. "కావల్సిందల్లా చేయించుకుంటూనే ఉంటారు. మళ్ళీ ఎప్పుడూ ఏదో ఒక సొద్దే ఆ రెండుగుండీలు కూడా తీసి పారెయ్యమన్న భావం కన్పించింది. ఇందాక మీ చూపుల్లో హు ఇలా క్షణ క్షణానికీ ఎక్స్‌ప్రెషను మార్చేసేవాళ్ళని మిమ్మల్నే చూస్తున్నాను."

పరబ్రహ్మం దంత గర్వంతో అన్నాడు "చూడూ ఇప్పుడవన్నీ నీతో వాదిస్తూ కూర్చోడానికి తీరిక లేదు నాకు. డా. సింగ్ పిడ్కోలు పార్టీకి వెళ్ళాలి."

"అవున్లెండి. పోచికోలు విషయాలైతే మాట్లాడ్డానికి టైముంటుంది. ముఖ్యమైన విషయాలు మాట్లాడ్డానికే ఉండదు! అయినా చూడూ' అంటారు. అక్కడేముందీ చూడ్డానికి! గుండీలే లేవయ్యే! 'చక్కీవా' సేఫ్టీ పిన్నులు పెట్టుకెళ్ళండి. నిన్ననే పూసలామె దగ్గర రెండు డజన్లు తీసుకున్నాను. ఏమో ఎప్పుడు సడెన్‌గా అవసరం వచ్చి పడుతుందోనని మీకేవో ఇటువంటి ముందుచూపే ఉండదు."

గుర్తొచ్చి అడిగేడు పరబ్రహ్మం "ఇంట్లో అప్పుడెప్పుడో నీలం రంగు గుండీలు పొట్లం కట్టి పెట్టానే నేను. గోడ బీరువాలో ఉండాలి చూడు కాస్త."

రెండు క్షణాలు మాట్లాళ్ళేదు సుగుణ ఆ తరవాత చూపులు వాల్చేసి ముక్తసరిగా అంది: "నిన్ననే ఆ గోడ బీరువా అంతా సర్దేను. పనికి రాని చెత్తంతా పేరుకుపోయుంటే బయట కాలువలో పారబోశాను. కాలం చెల్లిన మాత్రలూ, పనికి రాని కాగితాలూ అందులో గాని పోయిందేమో నేనేం కలగన్నానా మీకు గుండీలు అవసరం పడ్తాయనీ!?"

మాట్లాడకుండా నిల్చున్న పరబ్రహ్మం ముఖాన ఎక్స్‌ప్రెషన్ చూడకుండా "ఉరికే అట్లా నిల్చోకండి మరి సింగు పార్టీకి వెళ్ళదలచుకుంటే తయారవండి. లాట్ బన్ కాకపోతే ఆటోలో వెళ్ళగూడదా ఏం? మధ్యలో ఎక్కడా ఆగకుండా డైరెక్టుగా వెళ్ళచ్చు గూడా" అన్నది కాసేపాగి.

"ఏదీ షర్టుకి పిన్నులు పెట్టుకునేనా?" విసుక్కుంటూ అన్నాడు పరబ్రహ్మం.

"ఏం పెట్టుకుపోతే!? అహాఁ ఏమవుతుందీ!" రాడికల్‌గా ఆలోచిస్తూ అంది సుగుణ "అసలు సేఫ్టీ పిన్నులు తయారు చేసిందెందుకండీ? ఇట్లాంటి అత్యవసర సందర్భంలో అవసరం వస్తాయనేగాదూ? హుఁ. మీరు షర్టుకి పెట్టుకోవాలంటేనే ఇలా 'మొహమాట' పడుతున్నారు. మా తాత గారయితే కోటు బొత్తాములన్నీ పోతే కోటుకే సేఫ్టీ పిన్నులు పెట్టుకెళ్ళి శిరస్తాదారుగారితో రోజల్లా ఇంగ్లీషులో మాట్లాడి వచ్చేరు. మీ కెందుకు? మీరు షర్టుకి పిన్నులు పెట్టుకెళ్ళండి డివ్వాళ నాలుగు రోజుల్లో ఇదే ఫ్యాషను కాకపోతే నన్నడగండి. వెనకటి కో ఫ్రెంచి రాణి చెప్పుల్ని మెడగా తొడుక్కుని దర్బారుకి వెళ్ళిందట. మర్నాట్నించీ అంతా అట్లాగే తొడుక్కోసాగేర్ట. మా చినతాతగారి చెబుతుండేవారు."

ఇక మాట్లాడ్డం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన పరబ్రహ్మం "వూఁ సర్లే. ఆ సేఫ్టీ పిన్నులేవో ఇట్లా పడెయ్" అంటూ సుగుణ తాత గారిని అనుకరించడానికి నడుం కట్టేడు.


పిన్నులు పెట్టిన షర్టు టక్ చేసి సుగుణ తాత గార్ని వూహించుకున్నాడో, లేదో మెరుపులాంటి ఉపాయం తట్టింది.

సేఫ్టీ పిన్నులు బొత్తిగా కన్పించకుండా పైన వెడల్పాటి 'టై' కట్టుకున్న భర్త తెలివితేటలకి ముగ్ధురాలై పోతూ మాంగల్యాన్ని కండ్ల కద్దుకుని ఆనందబాష్పాలతో 'భగవాన్! వచ్చే జన్మలో కూడా వారికి నన్నే పత్నిగా ప్రసాదించు, భగవాన్, నన్నే ప్రసాదించు' అన్న భావాన్ని వ్యక్తం చేసింది.

• • •

అన్నట్లుగానే రెండురోజులు తిరక్కుండానే చొక్కాలన్నింటికీ 'పళ్ళు కట్టించేసింది' డాక్టర్ సుగుణా పరబ్రహ్మం.

చేసింది గానీ సుగుణలో వెనుకటి వాదనా ధోరణి, ఎట్లాగైనా తన మాట నిలుపుకోవాలని చూసే పట్టుదలా, ఆ హుషారూ కొంచెం తగ్గిపోయాయి ఇటీవల అన్పించింది పరబ్రహ్మానికి.




ముక్తసరిగా మాట్లాడుతోంది మధ్య మధ్య తడబడుతున్నాయి. మాటలు పరధ్యానంగా కూడా కన్పిస్తోంది మనిషి కానీ వివరం కనుక్కోడానికి వీలు కలుగలేదు పరబ్రహ్మానికి డే షిఫ్టు కారణంగా.

తన 'పని నిడుపు' రోజున సంగతేంటో తెలుసుకుందామని అనుకుంటున్నాడు పరబ్రహ్మం.

ఇంతలో అక్కడే తచ్చాడుతూన్నట్లు కన్పిస్తున్న సుగుణ "ఏమండీ, మీతో ఒక మాట చెప్పాలి" అన్నది మెల్లగా, మెత్తగా, నయంగా, అనునయంగా మాట్లాడుతూ.

"ఒక మాటా? ఏమిటదీ?"

"మాటంటే మాటేమీ కాదనుకోండి" మెల్లగా మెత్తగా మాట్లాడుతూ అంది సుగుణ. "అదే ఒక పని కాస్త మీతో చెప్పాలి."

"ఒక పనీ!? పని చెప్పడానికి ఎన్నడూ లేంది ఎందు కింత సందేహిస్తున్నావు?" అనుమానంగా చూశాడు పరబ్రహ్మం.

# తలనొప్పి, లెన్నెన్నో



# చికిత్స ఒకటి!

# అనాసిన్

## దీన్లో బాధనివారణశక్తి ఎక్కువగా ఉంది

వెంటనే ఉపశమనం యివ్వడం కోసం అనాసిన్‌లో, ప్రపంచమంతటా డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేసే బాధానివారక ఔషధాలు మరింత ఎక్కువగా ఉన్నాయి.

తలనొప్పి, జలుబు, పడిశెం, ఫ్లూ, నడుం నొప్పి, కండరాల నొప్పి, పంటి నొప్పి, వీటికోసం చాలా బాగా పనిచేస్తుంది.

కేవలం అనాసిన్ పైనే విశ్వాసం ఉంచండి.

ఇప్పుడు సురక్షితమైన ఫాయిల్ ప్యాకింగ్‌లో.




భారతదేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పి నివారించే ఔషధం.

* Licensed user of T.M.: Geoffrey Manners & Co.Ltd. GM-1-83 TL




"పని చెప్పడమంటే మీకు పని చెప్పటమేమీ కాదు.నేనే చేస్కున్నాను ప్రతి దానికీ అట్లా రెండర్థాలు తియ్యకండి మరీ." కొంచెం గట్టిపడుతూ అన్నది సుగుణ "ఒక పని నేనే చేశాను మీకు చెప్పకుండా."

"నాకు చెప్పకుండా నువ్వే చేసేశావా అవ్వా! మంచిదేగా!"

"మంచిదేనా?! ఇప్పుడే చెబుతున్నా మరి చెప్పినతరవాత కోపానికి రాగూడదు మ రి ఏదీ చేతిలో చెయ్యి వెయ్యండి.

"వూఁ? భయంగా, సందేహంగా చూస్తూ వెనక్కి చేతులు కట్టేసుకుంటూ అనుమానంగా అడిగాడు పరబ్రహ్మం. 'కొంపదీసి నేను బూట్లు కొనుక్కుందామని దాచుకున్న నూటయాభై రూపాయలుగానీ తియ్యలేదుగదా?

బుస్సుమంది సుగుణ. "మీరెప్పుడూ ఇంతే. అంథా—వికటమే చెప్పేదాన్ని చెప్పనివ్వరు. మీ ఇష్టం వచ్చినట్లనుకోండి" అని వెనక్కి తిరిగింది.

"సర్లే, నా కంగారులో నేనేదో అన్నాన్లేగానీ ఏమిటి సంగతి చెప్పు?" నస్పెన్సు ఫీలవుతూ పోబోతూన్న సుగుణ చెయ్యి పట్టుకున్నాడు పరబ్రహ్మం.

అంత తేలిగ్గా వదల్లేదు సుగుణ—చెయ్యి విడిపించుకునే ప్రయత్నం చేసింది. 'వదలండి—నన్నొదలండి. మీ మగాళ్ళ కింతే. కృతజ్ఞత అనేది ఉండదు. ఇల్లు గదా బాధ్యతగదా అని నేనేదో నెత్తినేసుకుని చెయ్యడమూ ఆ తరువాత మీతోటేమో చివాట్లు తినడమూ. అబ్బ వదలండి. ఇష్...చెయ్యి వదలండి. ముక్కు తుడుచుకోవాలి చెయ్యొదలండి.'


టక్కున చెయ్యి వదిలాడు పరబ్రహ్మం. "హుఁ. ఈ ముక్కుని చూసే మోసపోయాను. ఆ పెళ్ళి చూపులనాడు ఈ ముక్కేగాని నా కంటబడకుండా ఉండుంటే నిన్ను కట్టుకోవాలని తిప్పలుబడేవాన్నే కాదు అనాడు. ఈనాడింత హైరానా పడాల్సొచ్చేదీ గాదు. నువ్వేమో అదే అలుసు తీసుకుంటున్నావు. కోపం వచ్చినా, అలుక వచ్చినా పొద్దస్తమానమూ ముక్కుతోటేనా పని తీస్కోటం!"

సుగుణ మాట్లాడలేదు. నాజూగ్గా ముక్కుతో పని తీస్కుంటూండిపోయింది.

ఎందుకైనా మంచిదని వెళ్ళి బీరువా తలుపులు తీసి, లాకర్ తాళం తీసి మూత తెరిచాడో లేదో—పరబ్రహ్మన్ని చూసి నోరు తెరచి బావురుమంది కాష్‌బాక్సు! ! !

అటు నాసికా యుద్ధం పట్టిన సుగుణ—ఇటు బోసి నోరు పెట్టిన డబ్బుల పెట్టె—రెంటి మధ్యా 'ఆశుగ విర్తాతవిపాతజాత నిబిడ వ్యథనంతరస్వార్ణమానమగుచును ఘుర్ఘుర ఘోషంబుతోడ గ్రోడము గూలెన్.' అట్లు గూలినాడు పరబ్రహ్మం.

ఖాళీ డబ్బు పెట్టెకేసీ, తనకేసీ మార్చి మార్చి చూస్తూ మూకాభినయం చేస్తూన్న 'హతాశ్ బాబు' వైపు చూస్తూ, ముక్కుకు కాస్త రెస్టిస్తూ అంది సుగుణ—"ఎందుకట్లా చూస్తారు? నేను చెప్పిందాకా వినే వోపికే లేకపొయ్యె మీకు. మీ డబ్బు నేనేమీ వాడుకోలేదు. ఇంటికోసమే ఖర్చు పెట్టాను."




తను తేరుకోవడానికి కాస్త టైమ్ పట్టింది పరబ్రహ్మానికి. అయితే అప్పుడు మొదలేసిన దేవీ ప్రసన్నయాగం రాత్రి పన్నెండు దాటాకగానీ పూర్తి కాలేదు.

'ఆసియా క్రీడల సందర్భంగా పిల్లలకి నవంబర్ పంథొమ్మిది నుండి డిసెంబరు నాలుగు వరకు సెలవులు. ముందొక మూడు రోజులు కలిపేస్తే దీపావళి కలిసొస్తుంది. పండక్కి తప్పకుండా మీరూ, చెల్లాయీ, పిల్లలూ బయల్దేరి రాగలరు' అని మరీ మరీ రాశాడు బావమరిది హనుమాండ్లు. అందుకని దీపావళికి నాలుగు రోజులు ముందు నుంచే కలిపి పదిహేను రోజులు సెలవు పెట్టాడు తను.

ఆ ఉదయం మామూలుగా కిటికీలోనుంచి చూసిన పరబ్రహ్మానికి పీట మీద కూర్చుని పాత్రలతో సతమతమవుతూన్న సుగుణే కనిపించింది గాని ప్యారీలక్ష్మి కనిపించలేదు.

"ఏంటివ్వాళ నువ్వు కూర్చున్నావు?" లేచొచ్చి సానుభూతిగా అన్నాడు పరబ్రహ్మం. 'పని మనిషి రాలేదా?'

"ఆఁ. మహామంచి పనిమనిషినే కుదిరించాడు లెండి మీ చౌకీదారు. ఈసారి నాకు కనపడ నీయండి—చెబుతాను."

"ఏమైందేంటే?"

"ఏముందీ కావటానికీ? చిత్రంగా అడుగుతారేం? మూడ్రోజులక్రితం అర్జంటు పనేదో ఉందక్కా—మూడు రోజులు సెలవు కావాలక్కా అనడిగితే 'సరేలే. దాన్దేవుంది—అలాగేలే' అన్నాను. నిన్న పొద్దున్న ఇంకో సెలవు చీటీ పంపించింది, ఇంకో మూడ్రోజులు పొడిగిస్తూ."

సానుభూతి చూపుతూ. తల పైకీ, కిందికీ వూపాడు ఇంటర్వ్యూ చేస్తున్న విలేకరిలా.

"ఇంకేవుందీ? ఈ మూడు రోజుల తరవాత పిల్లల కెట్లాగూ ఏషియాడ్ సెలవులేగా. మీరూ సెలవు పెడితిరి. ఇహ ఆ పదిహేను రోజూ లెట్లాగూ రాదు..." ప్రశ్నార్థకంగా చూసింది సుగుణ.

"లాసాఫ్ పే అన్నమాట" అన్నాడు పరబ్రహ్మం సాలోచనగా.

"నా ముఖమన్నమాట ఆ పిల్లకేమీ లాస్ కాదు. అయితే గియితే మనకే" అని నెమ్మదిగా అసలు సంగతి కొచ్చింది సుగుణ. "ఏవుందండీ, ఇవ్వాళా రేపూ పని మనుషులు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. ఏదో దొరికింది గదా అనుకున్నాను. రెండు నెలల జీతం అడ్వాన్సు ఇవ్వక్కా, ఇవ్వక్కా అని గీమాల్తుంటే ఈ కాస్త దొరికిన పని మనిషి మానేస్తుందేమోనని భయంతోఇచ్చేశానండీ."

నిర్ఘాంతపోతూ "వంద! వందా ఇచ్చేశావా?" అన్నాడు పరబ్రహ్మం.

"వూఁ. ఏం చేసేది మరీ? రెండు యాభయిలు వందై చచ్చిందిగదా. పొడైంది." అందులో తన తప్పేమీ లేదన్నట్లు అంది సుగుణ. "ఇహ పనికి వస్తుందో రాదో ఆ డబ్బు చేతికొస్తుందో రాదో వూఁ. పోతే" ముక్కును మళ్ళీ సిద్ధం చేస్తూ అంది. "పోతే ఆ కథ కథ అని ఒకే ఇదిగా అంటూంటే కథ వెయ్యడానికి ఒక యాభై ఇచ్చాను."

"కథా! కథేమిటే యాభై ఇవ్వడమేంటే?" కుర్చీవైపుగా వెనక్కి అడుగేశాడు పరబ్రహ్మం.

"అదేనండీ. మీకు అవ్వాళ చెప్పలేదూ. నా పేరుతో కథ రాసి అచ్చేయిస్తానంది ఆ పిల్ల. అందుకు యాభై రూపాయలు పేపరు వాళ్ళకి పంపించాలంటేనూ."

జాగ్రత్తగా చూసుకుని 'నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు పరబ్రహ్మం. "అదేమిటే కథ వేస్కుంటే వాళ్ళే మనకిస్తారేవోఁ?"

"కొంచెం పేరొచ్చింతరువాత మనం ఎంత అడిగితే అంత ఇస్తారట. నేనూ అదే ఆలోచించాను. ఇవ్వాళ మనం యాభైకి లోభించామనుకోండి. మరి రేప్రొద్దున వేలు సంపాదించే చాన్సు వదులు కున్నట్లేగా. అందుకే 'బాహో' ఆలోచించి యాభై ఇచ్చేను."

అప్పటికే తల పట్టుకుని పాత్రలో జీవించే యత్నంలో ఉన్నాడు పరబ్రహ్మం.

"పోన్లెండి రేపెట్లాగూ పండక్కి మా అన్నయ్య మీకు బట్టలు కొంటాడుగా. వాటితోబాటూ ఒక జత బూట్లు గూడా పెట్టేస్తాను లెండి. నా నుంచి ఈ పొరబాటు జరిగినందుకు ప్రాయశ్చిత్తంగా" అని దూకుడుగా వంటింట్లోకి వెళ్ళి 'ఫడాల్' మని తలుపుతో పని తీసుకుంది సుగుణ.

• • •

అది సంధ్యాకాలం. పక్షులు కిలకిలారావాలతో తమ తమ గూళ్ళకు పయనిస్తూ ఉన్నాయి. భాస్కరుడు అరుణ కిరణాలతో పశ్చిమాంబుధిలో ఈత కొట్టడానికి వెళ్ళుతున్నాడు. నిశా దేవత ప్రపంచాన్ని తన ఒడిలో లాలించడానికి సిద్ధం అవుతూన్నది.

వీధి నుంచి వస్తూన్న పరబ్రహ్మం చేతిలోని నీలం రంగు ప్లాస్టిక్కు బుట్ట పైనా, లోపలా వూదా రంగుతో మెరిసిపోతూన్న లేలేత వంకాయల పైనా భానుడు తన సంధ్యారుణ కాంతులను విరజిమ్ముతూ 'బాహో' తోమి, తొల్చి, గోడకానించి పెట్టిన ఇత్తడి తాంబాళంలా శోభిల్లుతున్నాడు.

ఆలోచనల్లో మునిగిపోయిన పరబ్రహ్మం ఆ సువర్ణ ప్రభని, ప్రతిఫలిస్తూన్న ఇత్తడి తాళం కప్పను చూసి వాస్తవ జగత్తులోకి వచ్చాడు.

పరబ్రహ్మం రాకను తన హైఫిడలిటీ ఏంటెనాతో జాడ కట్టి పక్కింటి పిన్నిగారు రావడమూ, తాళంచెవీ ఒక కవరూ ఇచ్చి వెళ్ళడమూ, ఆదుర్దాతో పరబ్రహ్మం తాళం తీసి లోనికి వెళ్ళి కవరు చించి కాగితం మడతలు విప్పి చదవడానికని లైటు స్విచ్ వేసి ఆరంభించడమూ త్రుటిలో జరిగిపోయాయి.

"బ్రహ్మశ్రీ రాజమాన్య రాజ పూజితులైన శ్రీవారి పాదపద్మములకు నమస్కరించి సుగుణ వ్రాసేది అనుకోని విధంగా ఈ మధ్యాహ్నం హనుమాండ్లన్నయ్య రావడమూ, బుజ్జి పెళ్ళి చూపులకని రేపు హోబలంకవా రొస్తున్నారని చెప్పి బయల్దేరదీయడంచేత, మధ్యాహ్నం బస్సుకు నేనూ చిరంజీవులూ వెళ్తున్నాము. ఎట్లాగూ నాలుగు రోజుల్లో పిల్లలకూ, రెండు రోజుల్లో మీకూ సెలవు మొదలవుతుంది గనుకను మీ బూట్లను గురించి హనుమాండ్లన్నయ్యతో ప్రస్తావించాలన్న ఉద్దేశం ఉండటంచేతనూ వెళ్ళుతున్నాను.

ముఖ్యంగా ప్రొద్దుటి భోజనాల అంట్లు అట్లాగే ఉన్నవి. హనుమాండ్లన్నయ్య వచ్చిం తరువాత ఆయనముందు నేను అంట్లు తోము కుంటే మీకే నామర్దా అయిన కారణంచేత అట్లాగే ఉంచినాను. పనిమనిషి సాయంత్రంగానీ పొద్దున్నగానీ వస్తుందని అశ్రద్ధ చేయవద్దు. వీలు చూసుకుని నేను మీ బూట్ల విషయం చర్చించగలను. మీరు పండగకు రెండు రోజులు ముందుగానే బాణా సంచాతో రాగలరు.

అంట్ల విషయము అశ్రద్ధ చేయవద్దు. ఇట్లు చరణదాసి సుగుణాదేవి."

పండ్ల మధ్య నాలుక చురుక్కుమంది పరబ్రహ్మానికి. అప్పుడే ఏమయింది—ఇంకా ఉంది.

★